# చందా ఉత్సవాలు

-వాణిశ్రీ

"ఇంకానా? ఇకపై సాగదు"

మా కుర్రాళ్లంతా ముక్తకంఠంతో కేకలు పెట్టారు.

సంగతేమిటంటే హౌసింగ్ బోర్డు కాలనీలోకి పక్కనే మా అభ్యుదయ నగర్ కాలనీ వెలిసింది. కొన్నేళ్లపాటు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాం.

డ్రైనేజీ కనెక్షన్ల కోసం, రోడ్లకోసం మా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాళ్లు చెప్పులు అరిగేలా మున్సిపాలిటీ ఆఫీసు చుట్టూ తిరుగుతుండేవాళ్లు. మంచినీళ్లకోసం వాటర్ బోర్డు అధికారుల కరుణా కటాక్షం కోసం పడిగాపులు కాస్తుండేవాళ్లం.

కొన్నేళ్లకు కష్టాలు తీరిపోయాయి. అన్ని సౌకర్యాలు ఏర్పడ్డాయి.

కాలనీ మెయిన్‌రోడ్డు మీద షాపింగ్ కాంప్లెక్సులు కళకళలాడసాగాయి. జనంతో కిటకిటలాడుతున్నాయి.

ఐతే హౌసింగ్ బోర్డు కాలనీ యూత్ అసోసియేషన్ పేరుతో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహిస్తూ మా కాలనీని కూడా కలుపుకునేవారు. మా కాలనీ వ్యాపారులంతా వాళ్లకే చందాలు ఇస్తున్నారు. మాకు కడుపు మండసాగింది.

ఇక మేము స్వతంత్ర్యం ప్రకటించుకుని యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం.

'ఇంకానా? ఇకపై మన కాలనీలో హౌసింగ్ బోర్డు పెత్తనం సాగదు' అని నినదించాం.

వినాయకచవితి నెలరోజులుందనగానే మేలుకుని అభ్యుదయ నగర్ యూత్ అసోసియేషన్ పేరుతో లెటర్ ప్యాడ్స్, రసీదు పుస్తకాలు అచ్చువేయించాం.

మా కాలనీ బిజినెస్ వాళ్లంతా మాకే చందాలు ఇచ్చారు.

హౌసింగ్ బోర్డు యూత్ మూతులు తిప్పుకున్నారు. ఐతే మాకేంటి?

మొదటిసారి కాబట్టి గణేష్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించి చందాలు ఇచ్చిన వాళ్లని సంతృప్తిపరచాలని గట్టిగా నిర్ణయించుకున్నాం.

రోడ్లమీద మండపం కడితే ట్రాఫిక్ ఇబ్బంది. అందుకని పార్కులో ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానం చేసాం.

పేరుకి పార్కేగానీ అక్కడ మున్సిపాలిటీ వాళ్ళు మొక్కలు నాటి అభివృద్ధి చేస్తేనేకదా? వాళ్ళు ఎంతసేపూ జీపుకి మైక్ కట్టుకుని 'పురజనులారా! మున్సిపాలిటీకి పన్నులు కట్టండి. లేకపోతే ఆస్తులు జప్తు చేయబడును' అని అనౌన్స్ చేయడంతోనే సరిపోతుంది.

కనీసం చెత్త ఎత్తి వీధులు శుభ్రం చేయడంలో కూడా వారికి ఆసక్తిలేదు. చెత్త ఎత్తించడానికి మా వెల్ఫేర్ అసోసియేషన్ వాళ్లు ఇంటింటికి డబ్బు వసూలు చేస్తుంటారు. మనం పన్నులు కడుతున్నాం కదా?

చెత్త తీసుకెళ్లే బాధ్యత మున్సిపాలిటీదికదా? మనం మళ్లీ అందుకు డబ్బు ఎందుకు చెల్లించాలని ఎవరూ అడగరు. ఇక్కడి గృహస్థులందరూ మంచివాళ్ళు.

అందువలన మేము పార్కులో కూర్చున్నవాళ్లని తరిమి సిమెంట్ బెంచీలు తీసి అవతల పారేసి వినాయక విగ్రహానికి మండపం ఏర్పాటు చేసాం. మైకు పెట్టి భయంకరమైన సౌండ్‌తో భక్తి పాటలు ప్రసారం చేస్తుంటే కాలనీ వాసులంతా భక్తి పారవశ్యంతో వింటున్నారు.

పార్కులో ప్రశాంత వాతావరణం ఉండాలిగానీ ఈ శబ్ద కాలుష్యం ఏమిట్రా బాబూ... అని ఎవరూ అడగలేదు.

మేమంతా గుంపుగా రసీదు పుస్తకాలు తీసుకుని ముందుగా బిజినెస్ చేస్తున్నవాళ్ల పని పట్టాం. అంతా కూడా సహరించారు (ఏడుస్తూనే). అలాగే అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్లని పట్టుకుని గృహస్థులకు ఫ్లాట్‌కి వంద తక్కువ కాకుండా టార్గెట్ విధించి ముక్కు పిండి వసూలు చేసాం.

కొందరు హోటల్‌వాళ్లు మేము డబ్బులు ఇవ్వం. కావాలంటే పులిహోర, దద్దోజనం పంపిస్తామన్నారు.

ఇది కూడా బాగానే వుందనుకుని తొమ్మిదిరోజులు తొమ్మిది హోటల్స్‌వాళ్లకి పంపించే బాధ్యత నెత్తిన పెట్టాం.

గణేష్ మందిరం భారీ ఎత్తున ఏర్పాటుచేసినప్పుడు విగ్రహం కూడా భారీగా ఉండాలికదా పది వేలు పోతే పోయాయనుకుని భారీ విగ్రహం ట్రాక్టర్‌పైన వేసుకొచ్చి పెట్టాం.

మేమీ ఏర్పాట్లు చేస్తుంటే హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి అధికార పార్టీ ప్రెసిడెంట్ క్వాలీస్ వాహనంలో విచ్చేసాడు.

మేం ఎదురెళ్లి స్వాగతం చెప్పాం. ఆయన పేరు బుజ్జిబాబు.

పేరుకే బుజ్జిగానీ భారీ పర్సనాలిటీ. నూట పాతికకిలోలకు తక్కువుండడు.

"తమ్మీ! ఓపెనింగ్‌కి అన్నను పిలిచింర్రా లేదా?" అన్నాడు.

మేం ఒకరి ముఖం మరొకరం చూసుకున్నాం. అన్న ఎవరో అర్థంకాలేదు.

మేము వెర్రిముఖాలెయ్యడం చూసి బుజ్జిబాబు పకపకా నవ్వాడు.

"గదేబై మన ఎమ్మెల్లే సాబ్‌ని పిల్వాలేగదా! ఈ ఏరియాలో గణేష్ మండపాలన్నీ అన్నేగదా ఓపెనింగ్ జేసేది. గామాత్రం తెల్వదాబై" అన్నాడు బుజ్జిబాబు.

మాకు విషయం అర్థమైంది.

"నిన్ను వెంటబెట్టుకుని ఎమ్మెల్లే సాబ్‌ని కలుద్దామనుకుంటున్నాం బై. నువ్వే వచ్చినావ్" అని మాలో ఒకడు పచ్చి అబద్ధం ఆడాడు.

బుజ్జిబాబు ముఖం దీపావళి నాటి మతాబాలా వెలిగిపోయింది.

"జల్దీ బయల్దేరండి బై. అన్నని కలసి టైమ్ ఫిక్స్ చేసుకుందాం" అన్నాడు బుజ్జిబాబు.


మమ్మల్ని క్వాలీస్‌లో ఎక్కించుకుని ఎమ్మెల్యే మన్‌మోహన్ ఇంటికి తీసుకెళ్లాడు. అభ్యుదయ నగర్ యూత్ అసోసియేషన్ మెంబర్లని పేరు పేరునా పరిచయం చేసాడు.

కాలనీలో మొదటిసారిగా గణేష్ నవరాత్రులు

ఉత్సవం చేస్తున్నారనీ, కుర్రాళ్ళు కొత్తయినా ఏర్పాట్లు సూపర్‌గా చేసారనీ, అన్నకు వినైల్ పోస్టర్లతో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసారనీ సొరకాయలు, గుమ్మడికాయలు కోసాడు.

"మనం అన్న బొమ్మల్తో వినైల్ పోస్టర్లు ఎక్కడ వేశాం?'' అని ప్రశ్నిస్తే బుజ్జిబాబు పకపకా నవ్వాడు.

"గట్ల చెప్తేనే అన్న ఖుషీ అయితడు. వినైల్ పోస్టర్లు పాతిక ప్రింట్ చేయించండిభై. అన్న బొమ్మ



బాగా రావాలె'' అన్నాడు.

మా యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాతిక వినైల్ పోస్టర్లకి ఆర్డర్ ఇచ్చాడు.

వాళ్లిచ్చిన బిల్లు చూసి బేర్‌మన్నాడు. మేము చందాలు వసూలు చేసిన డబ్బులు సగం వాటికే అయ్యేట్టుంది.

"డబ్బు పోతే పోయిందిలే...ఎమ్మెల్యేతో పరిచయాలుంటాయిగా. ముందు ముందు మనం ఏదైనా వెధవ పని చేసి పోలీసుకేసుల్లో ఇరుక్కుంటే విడిపించడానికి పనికొస్తాడు'' అన్నాడు ఒకడు.

'నిజమేగదా' అన్నారంతా.


"ఎమ్మెల్యే పరిచయమయ్యాడని వెధవ పనులు మొదలుపెట్టకండి'' అని వార్నింగ్ ఇచ్చాడు సెక్రటరీ.

"కావాలని వెధవ పనులు ఎందుకు చేస్తాం? ఏదో ఎప్పుడైనా పొరపాటున చేస్తే చెయ్యొచ్చుగాక'' అని ఎవరో జోకారు.



## మళ్ళీ హొయలు

తెలుగులో అగ్ర హీరోలతో సైతం నటించి అందరినీ మెప్పించిన బెజవాడ అమ్మాయి రంభ మొన్నటివరకు తమిళంలో హొయలొలికించింది. బాలీవుడ్‌లో కూడా సునీల్‌శెట్టి, సల్మాన్‌ఖాన్, గోవిందాలతో రంభ నటించింది. హీరోయిన్ అవకాశాలు బొంబాయి భామల వశం కావడంతో ఇప్పుడు ఐటమ్ గర్ల్‌గా కొత్త అవతారమెత్తింది. ఈ అవతారం ఆమెను ఏ తీరాలకు చేరుస్తుందో చూడాలి మరి.



సరే మెయిన్‌రోడ్డుమీద, కాలనీలో అభ్యుదయనగర్ కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అనీ, గౌరవనీయ ఎమ్మెల్యే మన్‌మోహన్‌గారు ప్రారంభిస్తారనీ తళతళ మెరిసిపోతున్న వినైల్ పోస్టర్లు ఏర్పాటు చేసాం.

★★★

నవరాత్రులు మొదటిరోజు ఉదయం తొమ్మిదింటికి ఎమ్మెల్యేగారు ప్రారంభిస్తారని కాలనీ వాసులంతా చేరిపోయారు.

పుల్లారెడ్డి స్వీట్స్ పంచుతారని మా యూత్ వాళ్లంతా ప్రచారం చేయడంతో జనం బాగా వచ్చారు.

మేమంతా తలస్నానాలు చేసి కొత్త డ్రెస్సులు వేసుకుని పార్కులో మండపం దగ్గర తయారయ్యాం.

ఉదయం తొమ్మిదయింది. పది, పదిన్నర అయింది. ఎమ్మెల్యేగారు వస్తున్న జాడలేదు.

మా ప్రెసిడెంట్, సెక్రటరీల బిపి పెరిగిపోతోంది.

ఎమ్మెల్యేగారి సెల్‌కి ఫోన్ చేస్తే ఎంగేజ్ వస్తోంది. లాండ్‌లైన్లకి చేస్తే ఇంట్లో లేరని సమాధానం వచ్చింది.

ఇంతలో పార్కు ముందు క్వాలీస్ ఆగింది.

అందులోనుంచి బుజ్జిబాబు ఆపసోపాలు పడుతూ తన భారీకాయాన్ని వూపుకుంటూ దిగాడు.

"ఎమ్మెల్యే సాబ్ ఇంకా రాలేదని...'' మా ప్రెసిడెంట్ అంటుండగా బుజ్జిబాబు చెప్పనివ్వకుండా మండిపడ్డాడు.

"ఎవడు బై వినైల్ పోస్టర్లు డిజైన్ చేయించింది'' అన్నాడు.

"నేనే...'' అన్నాడు ప్రెసిడెంట్.

"నీకు బుద్ధిలేదు బై. అరె...అన్న ఫోటో గణేష్ పక్కన ఎలకలా పెట్టిస్తావా? గణేష్ బొమ్మకన్నా అన్న ఫోటో పెద్దదిగా ఉండాల్నా లేదా?'' అన్నాడు బుజ్జిబాబు.

ప్రెసిడెంట్ బిత్తరపోయాడు.

మాకు నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు. 'దేవుడు గొప్పా? ఎమ్మెల్యే గొప్పా?'

"అన్నకు ఎవడో ఫోను కొట్టిండు ఫోటో చిన్నగుందని. గణేష్ పక్కన ఎలకలా ఉన్నావని. అన్న గరమైతండు. గందుకే రాలే'' అన్నాడు బుజ్జిబాబు.

మా పని ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లు తయ్యారైంది. ఉత్సవాలు ప్రారంభించాలా? వద్దా? ప్రారంభిస్తే ఎలా? ప్రారంభించకపోతే ఎలా?

"ఇప్పుడేం చేయాలి బై?'' అన్నాడు మా ప్రెసిడెంట్ నీళ్లు కారిపోతూ.

"చేసేదేముంది. అన్న ఫోటో పెద్దది చేసి, గణేష్‌ది చిన్నది వేసి మళ్లీ వినైల్ పోస్టర్లు కొట్టిపించు'' అన్నాడు బుజ్జిబాబు.

"మరి ఉత్సవాలు ఆలస్యమవుతాయిగా'' సందేహం వ్యక్తపరిచాడు ప్రెసిడెంట్.

"ఒక్కరోజు లేటైతే కొంప మునుగుతాదానయ్యా! అరె... ఉత్సవాలు దేవుంది బై. మనమెట్లా జేస్తే అట్లా జరుగుతయ్యి. జల్దీ పోస్టర్లు కొట్టిపియ్యి. అన్నకు నేను సర్దిచెప్తాలే'' అని క్వాలీస్ ఎక్కి తుర్రుమన్నాడు బుజ్జిబాబు.

మా ప్రెసిడెంట్, సెక్రటరీ పోస్టర్లు కొట్టేవాడి దగ్గరకు పరుగెత్తారు. జనం ఎటువాళ్లటు చెల్లాచెదురయ్యారు.

మర్నాడు ఉదయానికల్లా ఎమ్మెల్యేగారి ఫోటో చాలా పెద్దదిగానూ, గణేష్ విగ్రహం చిన్నదిగానూ ఉన్నటువంటి వినైల్ పోస్టర్లు పాతవాటి స్థానే వెలిసాయి.

ఎమ్మెల్యేగారు ఆలస్యంగానైనా ఉత్సవాలు ప్రారంభించారు ఖుషీఖుషీగా నవ్వుతూ.

★